# శిష్యుల ద్వారా లక్షలాది మందికి టైక్వాండో శిక్షణ గర్వకారణం

**– 7డెన్ మాస్టార్ కె.వి.బాబురావు**



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** టైక్వాండో క్రీడ ద్వారా లక్షలాది మందికి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పోందే అవకాశం తన శిష్యులు ద్వారా లభించడం తనకు ఎంతో గర్వంగా ఉందని టైక్వాండో క్రీడ భారతదేశానికి పరిచయం చేసిన 7డెన్ మాస్టార్ కె.వి.బాబురావు పేర్కొన్నారు.కాకినాడ శ్రీనగర్ ఎ.ఎఫ్.ఎం.సి. స్కూల్లో టైక్వాండో క్లాస్కు గ్రాండ్ మాస్టార్ కె.వి.బాబురావు విచ్చేసారు.కార్యక్రమానికి జిల్లా టైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి అర్జునరావు అద్యక్షత వహించగా కె.వి.బాబురావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ తన వేసిన బీజం ద్వారా నేడు దేశవ్యాప్తంగా వేల మంది గురువులు మార్షల్ ఆర్ట్స్ క్లాస్లు నిర్వహించి లక్షల మందికి టైక్వాండో శిక్షణ ఇవ్వడం తనకు ఎంతో సంతృప్తి నిస్తుందన్నారు. అర్జునరావు మాట్లాడుతూ తాను బాబురావు శిష్యుడు కావడం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. అనంతరం బాబురావును టైక్వాండొ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అర్జునరావు, నాయకులు సత్యనారాయణ, తులసి, కె.వి.సత్యనారాయణ,అభిషేక్,చైతన్య,తేజా త్రిమూర్తులు పూలమాలలు వేసి సాలువాలు కప్పి పుష్పాగుచ్చాలు అందించి ఘనంగా సత్కరించారు. అదే విదంగా చిన్నారులు పూలమాలలు వేసి సత్కరించి ఫోటోలు తీయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టైక్వాండో క్రీడాకారులు పాల్గొన్నారు.


సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,3 ఫిబ్రవరి 2025




# ఎక్సైజ్‌లో
# లంచాల కిక్కు

## ఇంత బరితెగింపా !?








- లీజు రెన్యూవల్ ముసుగులో అనధికార వసూళ్ళు
- వ్యాపారుల నెత్తిన ఎక్సైజ్ అధికారుల భారం
- ఒక్కో మద్యంషాపు నుంచి రూ.లక్ష ఐదు వందల ముడుపులు
- తొలుత షాపుకి రూ.2 లక్షలు డిమాండ్
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలలో 413 మద్యంషాపుల వసూళ్లు
- డిప్యూటీ కమిషనర్ స్థాయి నుండి ఎక్సైజ్ కానిస్టేబుల్ వరకు వాటాలు పంపకాలు
- వసూళ్ళ సొమ్ము ఎక్కడికెళ్ళిందని మద్యం ట్రేడ్ వర్గాల్లో చర్చ
- ఏ స్థాయిలో ఎవరికెంత ముట్టింది..!
- కాకినాడ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తీరే వేరట!
- ఊరికి కనీసం ఐదు బెల్ట్ షాపులు!
- బెల్ట్ షాపుల్లో కల్తీ మద్యం... రూ.100 బ్రాండ్ లక్ష్యం
- ఎక్సైజ్ శాఖ అక్రమాలతో అపహాస్యం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలలో అబ్కారీ శాఖ అప్రతిష్ట మూటగట్టుకుంటున్నది. అవినీతి ఆరోపణలు, నిత్యం వివాదాలతో ఆ శాఖ పరువు బజారున పడుతున్నది. కాకినాడ జిల్లాలో జోనల్ అధికారి డిప్యూటీ కమిషనర్ ఉండగా... ఆయన పేరుతో లంచాలు వసూళ్ళు చేయడం అవినీతికి పరాకాష్టగా చెబుతున్నారు. తీవ్ర అవినీతి ఆరోపణలు, అక్రమ వ్యవహారాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు ఎక్సైజ్ శాఖను అపహాస్యం చేస్తున్నాయి... ఎక్సైజ్ సిబ్బంది అక్రమ వసూలు ళ్ళ...రెన్యూవల్ ఫీజుతో ముడుపులు సమర్పించుకున్న వ్యాపారులు... ఏయే స్థాయి అధికారికి ఎంత సొమ్ములు వాటాగా ఒక్కో మద్యం షాపు నుంచి అందాయి... లంచాల వసూళ్ళ సొమ్ము ఎక్కడికెళ్ళింది లాంటి అవినీతి పర్వాలపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం...

సూర్య బ్యూరో – ఉమ్మడి గోదావరి జిల్లాలు

- మిగతా 2 లో..

## ఆరోగ్య సంరక్షణకు కొత్త దిశ - కేంద్ర బడ్జెట్



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** కేంద్రం తాజా బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి మరింత బలాన్నిచ్చిందని, అందరికి ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నదని ముఖ్యంగా కాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు చికిత్సలో భారీ సాయం అందించేందుకు కీలక నిర్ణయం తీసుకుందని, దీనిలో భాగంగా 36 జీవరక్షక మందులకు కస్టమ్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇచ్చారని, మరికొన్ని ఔషధాలకు డ్యూటీని 5 శాతానికి పరిమితం చేశారని, దీనివల్ల రోగులకు ఆర్థిక భారం తగ్గుతుందని, పేషెంట్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ ద్వారా నిరుపేదలకు ఉచిత మందులందించే పథకాన్ని విస్తరించడం గొప్ప ముందడుగు అని, పిఎం జనారోగ్య యోజన క్రింద వర్కర్లకు వైద్య సేవలు కల్పించడం అభినందనీయమని, ఆరోగ్య పరిరక్షణ కల్పించాలనే నిర్ణయం సాహసోపేతమైన నిర్ణయం అని కాకినాడ జిల్లా డిప్యూటీ డిఎం & హెచ్‌ఓ డా.సరిత పేర్కొన్నారు.

## ముద్రగడ ఇంటిపై దాడిని ఖండించిన 'కుడా చైర్మన్'



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం ఇంటిపై జరిగిన దాడిని ఆదివారం జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు మరియు 'కుడా ఛైర్మన్' తుమ్మల రామస్వామి (బాబు) ఖండించారు. ఈ సందర్భంగా ఆదివారం పెద్దాపురం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) స్థానిక విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభరెడ్డి ఇంటిపై జరిగిన దాడిని ఖండించడం జరుగుతుందని, ఇటువంటి దాడులు హేయమైన చర్యలని, దాడి చేసిన వ్యక్తి జనసేన పార్టీకి చెందిన వ్యక్తిగా మీడియలో ప్రచారం రావడంతో ఆ వ్యక్తికి జనసేన పార్టీకి ఎటువంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. అలాగే ఇటువంటి దాడులును తమ పార్టీ తరపున పూర్తిగా ఖండించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ పట్టణాధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

**– పాల్గొన్న భక్తులు**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనా నికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆదివారం అన్నప్రసాద వితరణ దాతలు పెద్దాపురం పట్టణానికి చెందిన బలివాడ అశుతోష్, మాధవి దంపతులు, కోలా రంగ, అరుణ దంపతులు వారి సహకారంతో నిర్వహించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామ చంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రథోత్సవం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆదివారం శ్రీ స్వామివారి రథోత్సవ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులు టికెట్ తీసుకుని శ్రీ స్వామివారి రథ సేవలో పాల్గొన్నారు. భక్తులు గ్రామస్తులు రథంతోపాటు రాజగోపురం చుట్టూ ప్రదక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రథోత్సవ సేవలో ఆలయ వేద పండితులు, ఆలయ అర్చకులు, అర్చకులు, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, ఏఈఓ కొండలరావు, పిఆర్ఓ దామోర్ల కృష్ణారావు, ఆలయ సూపర్డెంట్లు సుబ్రహ్మణ్యం, సతీష్, సూపర్డెంట్ ఐ.వి.రామారావు, పిఆర్ఓ విభాగం గణపతి, పెద్దింటి తలుపులయ్య, దేవస్థానం అధికారులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా సౌభాగ్యవ్రతం



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా సౌభాగ్యవ్రతం నిలుస్తుందని వజ్ర వనిత వాసవి క్లబ్ సభ్యులు బంగారు కాశి అన్నపూర్ణ అన్నారు. ఆదివారం కొవ్వూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు సౌభాగ్యవ్రతాన్ని మరియు లక్ష పసుపు కొమ్ముల పూజ ను నిర్వహించారు. మహిళలకు పసుపు కుంకుమలను వస్త్రాలను వాయినాలుగా ఇచ్చారు.ఈ సందర్భంగా కాశీ అన్నపూర్ణ మాట్లాడుతూ భారతీయ మహిళలు పసుపు కుంకుమలకు మాంగల్యానికి ప్రాధాన్యతనిస్తారని అన్నారు ప్రతి మహిళ పసుపు కుంకుమలతో అలంకరించుకుని నిండు సుమంగళిగా జీవించాలని కోరుతూ ఈ సౌభాగ్య వ్రతం చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మహిళలు విశేషంగా పాల్గొని వాయినాలను తీసుకున్నారు.

## అంత్యక్రియల సహాయార్థం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం




**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు ఎటపాక మండలం గౌరీదేవిపేట గ్రామంలో గాదె వెంకటమ్మ, గొమ్ము కోయగూడెం గ్రామంలో ఇస్మాయిల్ అనారోగ్య కారణాలతో మరణించారు. మృతుల కుటుంబాల వారు నిరుపేద కుటుంబానికి చెందినవారు. విషయం తెలుసుకున్న ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ ఒక్కొక్క కుటుంబానికి 3000 రూపాయల చొప్పున అందించడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి ఎస్టీ సెల్ నాయకులు కణితి మధు మాట్లాడుతూ లక్ష్మీపురం పంచాయతీ కన్నాపురం గ్రామంలో కురసం భద్రయ్య, పొడియం రాజారావు ప్రమాదవశాత్తు మరణించారు అని, వారిది చాలా నిరుపేద కుటుంబమని ఈ విషయాన్ని మధు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత జమాల్ ఖాన్ కి తెలియజేయంగనే సంఘటన జరిగిన రోజు ఆసుపత్రి వద్ద ఖర్చుల నిమిత్తం ఫోన్ పే ద్వారా తల ఒక 3000 చప్పున మొత్తం 6000 అందించారని, జామల్ ఖాన్ సహృదయానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మధు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు శివ కనకరాజు, సర్పంచ్ మడకం నరసింహ రావు, గుత్తా వెంకన్న, హరిబాబు, గాదె రాంబాబు, గంగరాజు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్

**– విచ్చలవిడిగా బెల్ట్ షాప్‌లు**



**రావులపాలెం, మేజర్‌న్యూస్ :** మద్యం ధరలు ఆకాశనంటాయని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందిస్తామని అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే చంద్రబాబు మద్యం పాలసీని మర్చి టెండర్‌లు పిలిచాడు. ఇక్కడ గతప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యంఅమ్మేది, ఇది పూర్తిగా అప్పటి వైసీపీ నాయకుల చెప్పుచేతల్లో అన్ని తానై నడిపించేవారు. ఇప్పుడు ఆ పాలసీ పోయి పాటదారులు వచ్చిన అందురు సిండికేట్‌గా ఏర్పడి మద్యం దుకాణాలు దక్కించ్చుకున్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలు వారికి అడ్డంకిగా నిలబడి వారు అనుకున్నది లాభం లేకుండా పోయింది అనే బాధ వారిలో ఉంది. ఇదే అదునుగా భావించి గ్రామాల్లో ఒక్కొక్క మద్యం షాప్‌కు రెండు మూడు బెల్ట్ షాప్‌లు లెక్క కావలసినవారికీ కేటాయించి, వారి వద్ద నుండి కొంత సొమ్ము డిపాజిట్ చేయించుకుని మద్యం సీసాపై ఇరవై ముప్పై రూపాయిలు ఎక్కువ అమ్ముకునేటట్టు చేసుకున్నారు మద్యం షాప్ యజమానులు అనేది జగమెరిగిన సత్యం. ఇలా పోలవరం లో ఒకటి, పొడగట్లపల్లిలో రెండు, ఈతకోటలో రెండు, దేవరపల్లిలో ఒకటి, గోపాలపురంలో రెండు చోట్ల..ఇలా గ్రామాల్లో విచ్చల విడిగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇలా బెల్ట్ షాప్ లు బహిరంగం గానే కొనసాగిస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం కొసమెరుపు. రావులపాలెం వంటి పట్టణాల్లో హొటల్స్, రెస్టారంట్‌లలో బహిరంగంగానే అమ్మకాలు సాగిస్తున్నారు అనడంలో సందేహం లేదు. బ్రాందీ షాప్‌ల వద్దే బార్‌లు తెరిచారు. సాధారణంగా పర్మిట్ రూమ్‌లు కొరకు ప్రభుత్వానికి ఫీజు చెల్లించి అనుమతి పొందాలి కానీ రావులపాలెం మండలంలో ప్రతి దుకాణం వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేయడం విశేషం. నాణ్యమైన మద్యం క్వాటర్ వందకే అందిస్తాం, బ్రాండెడ్ మద్యం తక్కువ ధరలకే అందిస్తాము అని చెప్పిన ప్రభుత్వం నేడు వాటితోపాటు విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం అమ్మకాలపై కూడా ప్రజలు గుర్రుగా ఉండడం విశేషం. గత వైసీపీ ప్రభుత్వం ఇదే మద్యం, ఇసుక మట్టి విధానాలలో పూర్తిగా విఫలమయ్యి, ప్రజలను పట్టించుకోకుండా నాయకులు జేబులు నింపుకునే పనిలో ఉండి, ఎన్ని పథకాలు ఇచ్చినప్పటికీ ఈ దందాలను సహించలేక ప్రజా వ్యతికేత మూటగట్టుకుని టీడీపీ ప్రభుత్వానికి పట్టం కడితే నేడు వీరు కూడా అదే పంథాలో కొనసాగడం చూస్తుంటే ఇప్పటికే ప్రజలు విసిగిచెందుతున్నారు అనడంలో సందేహం లేదు. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వహించకుండా గ్రామాల్లో బెల్ట్ షాప్ లను ఏరివేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల మెరుపు దాడి చేసినా,వారు ఆస్థలంలోనే మరల బెల్ట్ షాప్‌లు నిర్వహిస్తున్నారు అంటే ఏ మేరకు అధికారుల భయం ఉందో తేటతెల్లం కావాలి అంటే ఆ బెల్ట్‌షాప్‌కు మద్యం సీసాలు అందించిన షాప్‌పై మొదటిగా ఫైన్ విధించాలి, తదుపరి లైసెన్స్ రద్దు చేయాలనే నిబంధనలు కఠినంగా అమలు చేయాలనీ ప్రజలు కోరుకుంటున్నారు.

# మార్చి 8వ తేదీ వరకు గ్రీవెన్స్‌లు రద్దు

**– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 8 వరకు పీజీఆర్ఎస్ రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మధ్య పీజీఆర్ఎస్ సెషన్‌లకు సంబంధించిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరగదని, ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాల కోసం ఎన్నికల కమిషన్ సూచనలు చెయ్యడం జరిగిందని ప్రాజెక్టు అధికారి తెలియ జేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల కారణంగా నిర్దిష్ట జిల్లాల్లో జిల్లా, డివిజన్, మండల స్థాయిలో సోమవారం పీజీఆర్ఎస్ సెషన్‌లు రద్దు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ రద్దు అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. కాగా ఫిర్యాదుల నమోదు కోసం సమీపంలోని సచివాలయాన్ని సందర్శించాలని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ ఎత్తేవరకు ఫిర్యాదులు సమర్పించడానికి "మీకోసం" ఆన్‌లైన్ పోర్టల్‌ని ఉపయోగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ సమాచారాన్ని తెలియచెయ్యడం జరుగుతోందని ప్రాజెక్టు అధికారి పేర్కొన్నారు. కాబట్టి ప్రజలు వ్యయ ప్రయాసలకు లోను కాకుండా ఉండేందుకు, జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పిజిఆర్ఎస్ నిర్వహించడం జరగనందున ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అర్జీలు ఇవ్వడానికి డివిజన్, మండల కేంద్రాలకు రావద్దని తెలియజేశారు. పట్టభద్రుల శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కోడ్ అమల్లో ఉన్నందున ఐటీడీఏ లోను, అన్ని మండలాల్లోనూ జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ప్రజలెవరు ప్రజా సమస్యలపై అర్జీలు ఇవ్వడానికి రంపచోడవరం రావద్దని, అదేవిధంగా ఈ విషయాన్ని ఏడు మండలాల్లో ఉన్న ప్రజలందరూ గమనించాలని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

సూర్య
తూర్పుగోదావరి
సోమవారం, 3 ఫిబ్రవరి 2025
2

## శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,000లు విరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కాకినాడ వాస్తవ్యులు రూ.1,00,000లు విరాళంగా దేవస్థానం పిఆర్ఓ దామెర్ల కృష్ణారావు, ఈఈ జగన్నాథంకు అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండవ తేదీన అన్నదానం జరిపించాలని దాత కోరారు. దాతను దేవస్థాన అధికారులు అభినందించారు.

## అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని తూర్పుగోదావరి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పిక్కి నాగేంద్ర అన్నారు. ఆదివారం కొవ్వూరు పట్టణంలోని పిక్కి నాగేంద్ర నివాసం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో, విద్య ఆరోగ్య వ్యవసాయం, రవాణా,గ్రామీణ అభివృద్ధి పట్టణ అభివృద్ధి, రక్షణ రంగం లకు కేంద్ర బడ్జెట్లో కేటాయింపులు ఇవ్వడం హర్షదాయకమన్నారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, విశాఖ స్టీల్ ప్లాంట్, మరియు విశాఖ రైల్వే జోన్లపై బడ్జెట్ కేటాయించి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సలాది సందీప్, కొవ్వూరు నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కన్వీనర్ మట్ల ఆంజనేయులు, 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, పోనంగి పవన్, తదితరులు పాల్గొన్నారు.

## బ్రతికుండగా రాని పద్మశ్రీ దశ దిన కర్మ రోజున వరించిన పద్మశ్రీ మిరియాల అప్పారావు






రావులపాలెం,మేజర్న్యూస్ : అయన ధ్యాస, అయన శ్వాస, అయన ఆశయం చివరి నిమిషం వరకు కళలు పట్ల ఆయనకున్న నమ్మకం, దానికోసమే బ్రతికాడు.. బుర్రకథకు జీవం పోసాడు.. చివరకు దశ దిన కర్మ రోజున అత్యున్నత పురస్కారానికి ఎంపికై చివరిరోజు క్రీ.శే.పద్మశ్రీ మిరియాల అప్పారావుగా బిరుదంకితుడయ్యారు.1949 సెప్టెంబర్ 9న కరప మండలం నడకుదురు గ్రామంలో వెంకట్రామయ్య, తిరుపతమ్మ దంపతులకు అప్పారావు జన్మించారు.చిన్ననాటి నుంచి నాటక, బుర్రకథ ప్రక్రియలవైపు ఆకర్షితులయ్యారు. దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు సింగపూర్, కువైట్ వంటి దేశాలలోనూ ప్రదర్శనలు ఇచ్చారు. అప్పారావు 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి. దాదాపుగా 5వేలకు పైగా ప్రదర్శనలిచ్చారు. బుర్రకథ టైగర్, గానకోకిల,వైఎస్ఆర్ ఎచీవ్‌మెంట్‌వంటి బిరుదులు, పురస్కారాలతో పాటు ఎన్నోసత్కారాలు ఆయన అందుకున్నారు. అస్వస్థతకు గురై గత నెల 15న తుదిశ్వాస విడిచారు. అప్పారావు భార్య నాగమణి కూడా బుర్రకథలు ప్రదర్శిస్తారు. ఆమె 2018లో మరణించారు. ఈ దంపతులకు 3 కుమారులు సుబ్బరాజు, బ్రహ్మాజీ, బాబా; ఇద్దరు కుమార్తెలు లలిత, శ్రీదేవి. ప్రస్తుతం వీరంతా బుర్రకథ కళాకారులే. నేడు ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తున్న 70 శాతం మంది అప్పారావు శిష్యులే కావడం విశేషం. కళారంగానికి చేసిన సేవలకుగానుఅప్పారావుకు మరణానంతరం గుర్తింపు లభించిందంటూ, బంధువులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

బుర్రకథ కళాకారుడు మిరియాల అప్పారావుది కోనసీమ జిల్లా రావులపాలెం. ఈయన గత కొంతకాలం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల మరణించారు. జనవరి 25వ తేదీన ఆయన పెద్ద కర్మ జరుగుతుండగా ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రకటన వెలువడడం విశేషం. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రప్రభుత్వం ప్రతి ఏటా పద్మ అవార్డులను ప్రకటిస్తుంది. వివిధ రంగాలైన కళలు, విద్య, పరిశ్రమలు, సాహిత్యం, శాస్త్రం, క్రీడలు, సామాజిక సేవ, ప్రజా జీవితాలు, మొదలగు వాటిలో విశిష్ట సేవ చేసినవారికి ఈ అవార్టులను ప్రకటిస్తుంది. వివిధ రంగాలలో కృషిచేసిన భారత పౌరులకు పద్మ విభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాల పేరిట అవార్టులను ప్రకటిస్తుంది.

అందులో భాగంగా బుర్రకథ కళాకారుడు మిరియాలఅప్పారావుకుపద్మశ్రీ వరించింది.కేంద్రప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డు మా ప్రాంతానికి చెందిన మిరియాల అప్పారావు వరించడం మా రావులపాలెంకు గర్వ కారణం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని అప్పారావు ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే సత్యానందరావు నివాళులు అర్పించారు. సింగపూర్, కువైట్ వంటి దేశాల్లో కూడా అప్పారావు తన ప్రదర్శనలు ఇచ్చారని, అయిదు వేలకు పైగా ప్రదర్శనలు చేయడమే కాకుండా నేడు బుర్రకథ చెప్పే అనేకమంది ఆయన శిష్యులేనని సత్యానందరావు గుర్తుచేశారు. ఈ సందర్భంగా అప్పారావు ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే సత్యానందరావు కోరుతూ నివాళులు అర్పించారు.

పద్మశ్రీ అవార్డు కొత్తపేట నియోజకవర్గంలో రావులపాలెంకు చెందిన మిరియాల అప్పారావుని వరించడం మాకు మా ప్రాంత ప్రజలకు గర్వకారణం అని మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని మిరియాల అప్పారావు ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి చిర్ల జగ్గిరెడ్డి మరియు స్థానిక నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు ఆయనను వరించేటప్పటికి ఆయన మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం అని ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను అని అన్నారు.

అయన పుట్టింది నడుకుదురు ఐనా అయన జీవన నేపథ్యంలో స్థిరపడింది రావులపాలెంలో. అయన కోరుకున్నది రావులపాలెం లో బుర్ర కథ సెంటర్ నెలకొల్పాలి అనేది చివరి కోరిక. ఆధునిక కాలంలో అంతరించిపోతున్న కళలకు జీవం పోయాలి అంటే మనం నేటి తరానికి కళ నేర్పాలి అని సంకల్పంతో ఉండేవారు. కానీ అయన అన్ని వేల ప్రదర్శనలు ఇచ్చిన ఆర్థికంగా నిలదొక్కుకున్న సందర్భం లేదు. కష్టాలు కన్నీళ్లు అయన కు తప్పలేదు. అందుకు బుర్ర కథ సెంటర్ నెలకొల్పాలి నలుగురికి నేర్పి భవిష్యత్ తరానికి బాట వేయాలనే కోరిక ప్రభుత్వం ఆ బాధ్యత తీసుకోవాలని రావులపాలెం పుర ప్రజానీకం కోరుతుంది.

అలాగే తెలంగాణలో పేద కళాకారుడు కిన్నెరా మొగులయ్యకు అవార్డు వచ్చినప్పుడు ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారం, ఇంటి స్థలం, నిర్మాణంలనే వీరి కుటుంబీకులకు అందించి ఆదరిస్తే ఈ కళ ను వారు వారసులు మరింత ముందుకు తీసుకెళ్తారు అనేది వారి స్నేహితులు,తోటి కళాకారుల ఆకాంక్ష.

## ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దు

**- జిల్లా కలెక్టర్ షణ్మోహన్**

**కాకినాడ,మేజర్న్యూస్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా కాకినాడ జిల్లాలో ప్రతిసోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పిజిఆర్ఎస్) కార్యక్రమం రద్దుచేయడం జరిగిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పిజిఆర్ఎస్) కార్యక్రమం తూర్పు-పశ్చిమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి సోమవారం జిల్లాలో మండల స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేయదలిస్తే సంబంధిత సచివాలయంలో మీకోసం పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

## వికలాంగురాలికి ఆర్థిక చేయూత నిచ్చిన అక్షయ సేవ సమితి



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలో పొడగట్లపల్లి గ్రామానికి చెందిన పిల్లి మార్తమ్మ చిన్నప్పటినుంచి పోలియో వ్యాధికి గురై నడవలేని స్థితిలో ఉంది. ఇప్పుడు ఆమె గుండె నీరు పట్టడం వల్ల అనారోగ్యానికి గురయ్యింది. వైద్యం చేయించుకునే స్తోమత లేక అక్షయ సేవా సంస్థను ఆర్థిక సహాయం కోరగా అక్షయ సేవా సంస్థ సభ్యులు నుంచి సేకరించిన మొత్తం రూ.11,000లు సంస్థ సభ్యులు చేతులు మీదుగా పొడగట్లపల్లి గ్రామం వెళ్లి పిల్లి మార్తమ్మకి ఇవ్వడం జరిగింది.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించిన రంబాల కార్తీక్



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీ కన్నాపురం గ్రామానికి చెందిన కుర్సం భద్రయ్య (41), పోడియం.రాజారావు (31) శుక్రవారం తమ స్నేహితుడని పరామర్శించేందుకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్నేహితులిద్దరికీ ఘోర ప్రమాదం జరగడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రైతుమిత్ర ఏజెన్సీస్ యజమాని అయిన రంభాల కార్తీక్ ఆ కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలవారు నిరుపేదలు కావడంతో, ఈ విషయం తెలుసుకున్న రంభాల కార్తీక్ ఒక కుటుంబానికి 5000 రూపాయలు చొప్పున మొత్తం 10,000 రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేసీ మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పూనేం వెంకటరావు, సొందే రమేష్, బుద్ధుల నాగేష్, వాసం ధర్మరాజు, గ్రామ పటేల్ సవలం రామయ్య పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమిదే విజయం

**- పిఠాపురం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పి.గోవింద్ సత్యనారాయణ**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థిదే విజయమని పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే, పి.గోవింద్ సత్యనారాయణ అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు పి. గోవింద్ సత్యనారాయణ నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలలో టీడీపీ విజయకేతనం మోగిందని, అదే విధంగా ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రులు ఎన్నికలలో జిల్లాలోనే పిఠాపురం నుండి అత్యధిక మెజారిటీ ఇచ్చి కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపుకు కృషి చేయాలని తెలిపారు. కూటమి నాయకులతో కలసి వెళ్ళి ప్రతీ ఓటర్ ను ఓటు వేయాలని అభ్యర్థించాలనీ, ఓటర్ వెరిఫికేషన్ 60 శాతం అయినదని, 100 శాతం పూర్తి చేయాలనీ, నాన్ లోకల్ ఓటర్స్ నీ గుర్తించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గల పట్టభద్రులు అందరి మొబైల్ నంబర్స్ సేకరించడం, ప్రతీ 30మంది ఓటర్లుకు ఒక ఇన్చార్జిని నియమించడం, పార్టీ శ్రేణులుతో సమావేశం ఏర్పాటు చేయడం,
ప్రతీ ఓటర్ తో ఫోన్ లో మాట్లాడి, కూటమి బలపరిచిన అభ్యర్థికీ తమ మొదటి ఓటు వేయాలని అభ్యర్థించడం, డోర్ టూ డోర్ ఎన్నిక ప్రచారం చేయడం, ఓటర్ ను గుర్తించడం చేయాలని నాయకులకు కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల %ఽ% టౌన్ పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు, క్లస్టర్స్, యూనిట్ ఇంచార్జిలు, ఎమ్మెల్సీ బూత్ కన్వీనర్స్ , కౌన్సిలర్లు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రగ్బీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**- అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వి.రామన్న రాజు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పట్టణంలోని స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు పరిశీలకులుగా కాకినాడ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి. శ్రీనివాస్ కుమార్ హాజరయ్యారు. రఘువీ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా వి.రామన్న రాజు, అధ్యక్షులుగా పి.దొరబాబు, ఉపాధ్యక్షులుగా ఎస్ గోవింద రాజు, కార్యదర్శిగా పి. కృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎం.చైతన్య, కోశాధికారిగా బి. నవీన్, సి ఈ ఒ కె. నాగ లింగేశ్వర రావు, ఎగ్జిక్యూటివ్ నెంబర్లుగా ఐ.నాగేంద్ర కుమార్, జె. ప్రసాద్ రావు, కె. చిన్నబ్బాయి, బి. సతీష్, బి.వంశీ, ఎస్. సతీష్, ఈ. అఖిల్, పి.సాయికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఎక్సైజ్‌లో లంచాల కిక్కు

**సూర్యబ్యూరో ఉమ్మడి గోదావరిజిల్లాలు :** మద్యం వ్యాపారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ వ్యాపారులకు 20 శాతం మార్జిన్ ఇస్తానని చెప్పి ప్రస్తుతం పది శాతమే జమ చేయడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు. మద్యం వ్యాపారులు దండిగా సంపాదించుకోవచ్చని కలలు కన్నారు. ఆ కలలన్నీ ఆవిరయ్యాయి. ఆశించిన లాభాలు రావడం లేదని లబోదిబోమంటున్నారు. టర్నోవర్ పెరిగితే కొంత్కెనా కవర్ చేసుకోవచ్చని బెల్ట్ షాపులపై భారీగా దృష్టి పెట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బెల్టు షాపుల్లో నకిలీ మద్యం అమ్ముతున్నారని విశ్వసనీయ సమాచారం. ఈ సమయంలో వ్యాపారుల నెత్తిన ఎక్సైజ్ అధికారులు భారం మోపారు.బెల్టులకు అధికార ముద్ర వేసేశారు.మీకు సహకరిస్తున్నాంమాకుఇవ్వాల్సినవి మాకు అందించండి అంటూ లీజు రెన్యూవల్ ముసుగులో అనధికార వసూళ్ళకు తెగబడ్డారు. షాపుకి రూ.2 లక్షలు చొప్పున డిమాండ్ చేశారు. తమకు అంత వ్యాపారం జరగడం లేదని సంప్రదింపుల తర్వాత కొంతమేరకు తగ్గారు. షాపులకు బెల్టు లు పెంచుకోవడానికి అవకాశం ఇచ్చి వసూళ్ళకు ఒప్పందం చేసుకున్నారు. ఒక్కో షాపు నుంచి రూ.లక్ష ఐదు వందలు వరకు ముడుపులు ముట్టజెప్పుకున్నారు. ఇదంతా గత నెల పండుగ ముందే జరిగిపోయింది..

**రూ.లక్ష ఐదు వందలలో ఎవరి వాటా ఎంత?**

ఎక్సైజ్ సిఐల నేతృత్వంలో అక్రమ వసూళ్ళు జరిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలలోని 413 మద్యం షాపుల నుంచి అక్రమ వసూళ్ళు జరిపారు. మూడు జిల్లాల ఎక్సైజ్ అధికారి డిప్యూటీ కమిషనర్ స్థాయిఅధికారికి ఒక్కోషాపునుంచి రూ.15వేలట,ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్థాయి అధికారికి ఒక్కో షాపు నుంచి రూ.30 వేలట, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎసికి 9వేలట,ఈఎస్ టాక్స్ ఫోర్స్ స్టాఫ్‌కి రూ.7వేలట, ఈఎస్ ఆఫీస్ స్టాఫ్‌కి రూ.3500లట, డిసి ఆఫీస్ స్టాఫ్‌కి రూవెయ్యి, ప్రతీ ఎక్సైజ్ సెక్షన్ సిఐ కి రూ.35,000 చొప్పున ఈ లక్ష ఐదువందలు వాటాలు పంచుకొన్నారని విశ్వసనీయ సమాచారం. ఇలా 413 షాపుల నుంచి అక్రమ వసూళ్లు చేసి పంచుకు తిన్నారంట.అయితే ఈ వసూళ్ళకు మొత్తం సూత్రధారి, పాత్రధారి ఓ కీలక జోనల్ అధికారిగా చేబుతున్నారు. కొంత డబ్బులు ఫోన్ పే ద్వారా కూడా మధ్యవర్తులకు అందించినట్లు తెలుస్తోంది. అయితే కీలక అధికారి ఆదేశాలతోనే ఈ అవినీతి వ్యవహారం నడిపి, వసూళ్లు జరిపినట్లు చెబుతున్నారు.

**బెల్టు దుకాణాలకు కల్తీ మద్యం..!**

మద్యం ప్రియులను లక్ష్యంగా చేసుకుని విచ్చలవిడిగా విక్రయాలు పెంచేందుకు బెల్టు దుకాణాలు భారీగా తెరిచారు. తక్కువ ధరకే మద్యం అని చెప్పి చీప్ లిక్కర్‌ని విక్రయిస్తున్నారు. దానిని కల్తీ చేసి భారీస్థాయిలో బెల్టుల ద్వారా అమ్మకాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. తిరుపతిలో పట్టుబడిన నకిలీ మద్యం రాకెట్ మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మద్యం బెల్టు దుకాణాల్లో ఉందని విశ్వసనీయ సమాచారం. విచ్చలవిడిగా నకిలీ మద్యం లేబుల్స్ లేని మద్యం అమ్మకాలు బెల్ట్ షాపు కేంద్రంగా చేస్తున్నారు. మామూళ్ళ మత్తులో ఎక్సైజ్ సిఐ లు పట్టించుకోవడం లేదు. బెల్టులు తొలగించాలని జిల్లా కలెక్టర్ షాన్మోహన్‌కి ప్రజలు వేడుకొంటున్నారు.

## మోడరన్‌లో స్ఫూర్తిదాయకంగా మెరిట్ విద్యార్థులకు పురస్కారాలు



రామచంద్రపురం, మేజర్ న్యూస్ : ఇటీవల మోడరన్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా స్కాలర్షిప్ కం అడాప్షన్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో అవార్డుల ప్రధానోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి పట్టణ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు చైర్ పర్సన్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి మోడరన్ అధినేత లయన్ డాక్టర్ జి.వి.రావు కృషి అభినందనీయం అన్నారు. అనంతరం మోడరన్ అధినేత జి.వి. రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ప్రోత్సాహాన్ని ఇచ్చేలా మోడరన్ విద్యాసంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు అవగాహనతో విద్యాభ్యాసన చేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ సి.హెచ్. రాజేష్ మాట్లాడుతూ... గత దశాబ్ద కాలంగా మోడరన్ జూనియర్ కాలేజ్ అకాడమిక్ మరియు పోటీ పరీక్షలలో కూడా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా ఇంటర్ తర్వాత ఉండే వివిధ కోర్సులను సవివరంగా విద్యార్థులకు వాటి తల్లిదండ్రులకు తెలియజేశారు.డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమయపాలన, సక్రమ ప్రణాళిక విజయానికి మార్గమని విద్యార్థులకు తెలిపారు. తమ చిన్నారులకు మెరిట్ అవార్డు దక్కడం పట్ల తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆప్సా అధ్యక్షుడు డి.సత్తిబాబు, వైస్ ప్రిన్సిపాల్ పిఎస్ ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సిహెచ్ శ్రీనివాస్, మ్యాథ్స్ ఫ్యాకల్టీ జీ.సతీష్ పాల్గొన్నారు.

## స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :**స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బృందాలుగా విడిపోయి కళాశాల పరిసర ప్రాంతాలను, సమీపంలో గల పబ్లిక్ పార్క్ ను శుభ్రపరిచారు. ప్లాస్టిక్ వ్యర్థాలను , పొడి చెత్తను సేకరించారు. దోమలకు నిలయమయ్యే చిత్తడి ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ ను చల్లారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన క్యాంపస్ ఇన్చార్జ్ ఎన్ మూర్తి మాట్లాడుతూ కమ్యూనిటీ సర్వీస్ లో కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ విషయమై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని అన్నారు. ఇంటి చుట్టూ తడిగా ఉన్న ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ చల్లాలని, దోమలను నివారించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇంచార్జ్ మూర్తి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, ఐ గౌరీ ప్రియ,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శ్రీ కళ్యాణ్, కుషాల్, అమృత్, హిమ బిందు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణతో తమ పని పూర్తి కాలేదు..

**- ఎమ్మెల్యే వరుపుల..**



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** పదవీ విరమణ తో తమ పని పూర్తి కాలేదని ప్రతిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా అన్నారు.అప్పన్నపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్ గా పనిచేస్తూ పదవీవిరమణ చేసిన కట్టా సూర్య ప్రకాశరావు పదవీవిరమణ సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏలేశ్వరం మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా శాసనసభ్యులు వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా 33 సంవత్సరాలు గురుతర బాధ్యత నిర్వహించి, పదవీ విరమణ పొందడం బాధాకరమైన ప్రభుత్వ ఉద్యోగికి తప్పదని ఆమె అన్నారు. తమ పని ముగిసింది అనుకోకుండా విద్యావంతులైన ఉపాధ్యాయులు తమ మేధస్సును వినియోగించి భావి భారత పౌరులను తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని ఆమె సన్మాన గ్రహీతకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ప్రజాప్రతినిధులు హాజరై మాస్టారు దంపతులను ఘనంగా సన్మానించడం జరిగింది, ఈ కార్యక్రమంలో యు టి ఎఫ్ అధ్యక్షులు సంజీవ్, ప్రధాన కార్యదర్శి కే.రవి యుటిఎఫ్ సీనియర్ నాయకులు.సుందర్రావు,జట్ల సోమరాజు, రాజశేఖర్, శిష్టా మూర్తి. గణపతి రావు, రాంబాబు,మురళి, అప్పారావు నాగేంద్ర , రాజు, దొర, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
తూర్పుగోదావరి
సోమవారం,
3 ఫిబ్రవరి 2025


## ముద్రగడ పద్మనాభం ఇంటి మీద జరిగిన దాడిని ఖండించిన తుమ్మలపల్లి రమేష్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కిర్లంపూడి గ్రామంలో ఆదివారం ఉదయం మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నివాసం వద్ద జరిగిన సంఘటన ను జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్ ఖండించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పద్మనాభం ఇంటి వద్ద ఇలాంటి ఘటన జరగడం బాధ కారమనీ దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఆ సంఘటన కు తమ పార్టీ కి సంబంధం లేదన్నారు. ఆ వ్యక్తి కి గత 6 నెలల నుంచి మతి స్థిమితం లేదని, 6 నెలల నుంచి కూడా తన కుటుంబ సభ్యులపై దాడులు చేయడం జరుగుతుందన్నారు. దీనిపై పోలీసులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జనసేన పార్టీ అధినాయకులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి గాని మాకు గాని ముద్రగడ పద్మనాభం గారంటే గౌరవం అని అన్నారు.

## కుంచె బాలకృష్ణకి ఉత్తమ సర్వీసెస్ అవార్డు



**అమలాపురం, మేజర్‌న్యూస్ :** అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కుంచె బాలకృష్ణకి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన చేసిన సేవలు గుర్తించి ఉత్తమ సర్వీసెస్ అవార్డును జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ సర్వీసెస్ అవార్డు అందుకున్న బాలకృష్ణకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు మరియు ఆఫీసు సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

**– 48 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

**– మీడియాకు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ బిందు మాధవ్**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** గత కొంతకాలంగా వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తూ... పోలీసులకు పట్టు పడకుండా తప్పించుకు తిరుగుతున్న అంతర్ జిల్లాల నేరస్తుడు అయిన సొంటిని గంగాధర్ ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 48 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ నందు పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ద్విచక్ర వాహనాలను దొంగలిస్తూ తప్పించుకు తిరుగుతున్న... పిఠాపురం పట్టణం అగ్రహారానికి చెందిన అంతర్ జిల్లాల నేరస్తుడు సొంటిని గంగాధర్ (37) ను అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అతడు గత సంవత్సర కాలంగా కాకినాడ మరియు అనకాపల్లి జిల్లాల లోని పోలీస్ స్టేషన్ లు అయిన పిఠాపురం టౌన్, పిఠాపురం రూరల్, ఉప్పాడ కొత్తపల్లి, గొల్లప్రోలు, సర్పవరం,



అన్నవరం, తొండంగి, తుని టౌన్ మరియు అనకాపల్లి రూరల్ పరిధిలలో నమోదు చేయబడిన 48 కేసులలో అతను దొంగతనం చేసి అమ్మిన మరియు అతని వద్ద అమ్మకానికి ఉంచిన 48 బైకులను రికవరీ చేసి, సదరు ముద్దాయిని క్రైమ్ నెంబర్ 36/2025, యు/ సెక్షన్ 303 (2) బీఎన్ఎస్ పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ లో నమోదు చేయబడిన కేసులో జేఎఫ్ సిఎం కోర్టు, పిఠాపురం నందు హాజరు పరుస్తున్నామన్నారు. అదేవిధముగా ఈ ముద్దాయి నుండి మోటార్ సైకిల్ లు కొనుగోలు చేసిన వారిని
కుడా ముద్దాయిలుగా చూపించడమైనదన్నారు. అంతర్ జిల్లాల నేరస్తుడును పట్టుకోవడంలో నైపుణ్యం ప్రదర్శించిన పిఠాపురం సర్కిల్ పోలీస్ సిబ్బందిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ పాత్రికే సమావేశంలో... కాకినాడ డి.ఎస్.పి పాటిల్ దేవరాజ్ మనీష్, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్, పిఠాపురం పట్టణ ఎస్సై వి. మణికుమార్, అదనపు ఎస్ఐ ఎస్.కె భాషా, పిఠాపురం రూరల్ ఎస్సై ఎల్. గుణశేఖర్, కొత్తపల్లి ఎస్సై జి. వెంకటేష్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా పి.జి.ఆర్.ఎస్.కు విరామం

**– ఆర్డీఓ శ్రీరమణి**

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించు కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని, ఆర్డీఓ కె.శ్రీరమణి ఒక ప్రకటనలో తెలిపారు. కావున డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల ప్రజలు ఈ విషయం గమనించాలని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఈ రద్దు అమలులో ఉంటుందని ఆమె తెలిపారు. అలాగే ఫిర్యాదులు సమర్పించడానికి ప్రజలు మీకోసం ఆన్‌లైన్ పోర్టల్ ఉపయోగించుకోవాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈ సమాచారాన్ని గ్రహించాలని ఆమె పేర్కొన్నారు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు



**కాజులూరు, మేజర్ న్యూస్ :** ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు రత్నప్రభా గ్రంథాలయం పల్లిపాలెంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు కలాలు పంపిణీ చేసారు. విద్యార్థులను ఉద్దేశించి రత్న ప్రభా గ్రంథాలయం డైరెక్టర్ మధునాపంతుల సత్యనారాయణ మూర్తి ప్రసంగిస్తూ చదువు, దానితోపాటు సంస్కారం అలవరుచుకోవాలి అన్నారు. మధునాపంతుల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ మధునాపంతుల మాట్లాడుతూ డెబ్బై శాతం తక్కువ కాకుండా పదోతరగతి లో ఉత్తీర్ణత సాధించి, ఇంటర్ మీడియట్ బాగా చదివి, ఇంజనీరింగ్ కళాశాల లో చేరేవారికి ఏవిధమైన ఆర్థిక సమస్య లేకుండా చదువు పూర్తి చేయడానికి తగిన ఆర్థిక మద్దతు మధునాపంతుల ఫౌండేషన్ ఇస్తుందని,అలా చదువు పూర్తి చేసు కున్న వారికి తన సంస్థలో ఉద్యోగం కూడా ఇవ్వగలననీ ప్రకటించారు. అనంతరం విద్యాకమిటీ చైర్మన్ బిళ్ళకుర్తి రామ చంద్రా రెడ్డి సరస్వతీ మాత ఆవిర్భావ విశేషాలు చెప్పారు. యం.వి.చలపతి, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రసంగించారు. నలభై మంది విద్యార్థులు ఉత్సాహంగా ఈ సభలో పాల్గొన్నారు. భవిష్యత్తు పట్ల ఆశాజనకంగా వారి మాటలు అనిపించాయి. అనంతరం స్థానిక విష్ణాలయంలో ఉన్న సరస్వతీ దేవిని విద్యార్థులు, ఇతరులు దర్శించుకున్నారు.

## కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయము సిపిఎం




**నరసాపురం రూరల్,మేజర్‌న్యూస్ :**కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్టును వ్యతిరేకిస్తూ సి. పి.యం పార్టీ నరసాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మణే శ్వరం సెంటర్లో ఆదివారం నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జల్లి రామమోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్టులో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ప్రధానమైన రంగాలకు ప్రాధాన్యతనివ్వలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బొక్కా శ్రీనివాస్,గుత్తుల నాగేశ్వరావు, కడలి నాగరాజు, సాగర్, నరసింహాస్వామి తదితరులుపాల్గొన్నారు.

## భావన్నారాయణ స్వామి ఆలయంలో మాఘ మాస సందడి







కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : సర్పవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావన్నారాయణ స్వామి ఆలయంలో మాఘమాస మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జనవరి 30 నుండి ప్రారంభమయిన కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరునాళ్ళు వైభవం గా జరిగాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మినారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాఘ మాసం మొదటి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ మాసంలో నాలుగు ఆదివారాలు ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజులు. ఆదివారం ఆలయ ఆవరణలో గల పరిసరాల ప్రాంతాలు భక్తులతో సందడి నెలకొంది. ఉపవాసాలతో ఆవు పిడకలు వెలిగించి ఆవు పాలు పొంగించి పొంగలి చేసి స్వామివారికి నివేదించిన తర్వాత భక్తులు ప్రసాదంగా అరగించడం ఇక్కడ ఆనవాయితీ! తెల్లవారు జామునే భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ అధికారులు మరియు పోలీస్ సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పర్యవేక్షించారు. మాఘ మాసం మొదటి ఆదివారం భావనారా యణస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉచిత అన్నదాన ఏర్పాట్లు చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 8 వరకు పీజీఆర్ఎస్ రద్దు



**– కలెక్టర్ పి.ప్రశాంతి**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఎన్నికల ప్రవర్తనా నియమావళి మధ్య పిజిఆర్ఎస్ సెషన్‌లకు సంబంధించిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరగదని, ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాల కోసం ఎన్నికల కమిషన్ సూచనలు చెయ్యడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల కారణంగా నిర్దిష్ట జిల్లాల్లో జిల్లా , డివిజన్, మండల స్థాయిలో సోమవారం పిజిఆర్ఎస్ సెషన్‌లు రద్దు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ రద్దు అమలులో ఉంటుంది. ఫిర్యాదుల నమోదు కోసం సమీపంలోని సచివాలయాన్ని సందర్శించండి. ౖ ఎన్నికల కోడ్ ఎత్తివేయబడే వరకు ఫిర్యాదులను సమర్పించడానికి "మీకోసం" ఆన్‌లైన్ పోర్టల్‌ని ఉపయోగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ సమాచారాన్ని తెలియ చెయ్యడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆ ప్రకటనలో పేర్కొనడం జరిగింది. కావున ప్రజలు వ్యయ ప్రయాసలకు లోనుకాకుండా ఉండేందుకు, జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పి జి ఆర్ ఎస్ నిర్వహించడం జరగనందున ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అర్జీలు ఇవ్వడానికి కలెక్టిరేట్, డివిజన్, మండల కేంద్రాలకు రావద్దని తెలియ చెయ్యడం జరుగుతోంది.

## బీఎస్పీ మద్దతు కోరిన ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి భీమేశ్వరరావు



**మేజర్‌న్యూస్ :** బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బక్కా పరంజ్యోతిని మద్దతు కోరిన ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి చిక్కా భీమేశ్వరరావు ఆదివారం ఏలూరు విచ్చే సిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షులు బక్కా పరంజ్యోతిని కలిసి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎం ఎల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తనకు మద్ద తు తెలియజేయమని కోరుతూకరపత్రాలు అందజేయడం జరిగింది

## పోణంగి శివారులో ముగ్గురు పేకాట రాయుళ్లు అరెస్టు

**ఏలూరు,మేజర్ న్యూస్ :** రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోణంగి గ్రామ శివారులలో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నారన్న సమాచారాన్ని ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ అందుకుని ఆదివారం రాత్రి దాడి చేశారు.

అక్కడ పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 2900 నగదుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఏలూరు రూరల్ ఎస్సై దుర్గ ప్రసాద్‌తో పాటు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## దళిత నాయకులు శ్రీధర్ మాతృమూర్తి మృతి



నరసాపురం, మేజర్ న్యూస్ : జై భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ న్యాయవాది, నియోజకవర్గ దళిత నాయకులు సోడదాసి శ్రీధర్ మాతృమూర్తి సోడ దాసి శాంతమ్మ (78) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంగా ఉంటూ వారి నివాసంలో మృతి చెందారు. శ్రీధర్ ను దళిత సంఘాల నాయకులు, న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు పరామర్శించారు.

సోమవారం ఉదయం భూస్థాపన కార్యక్రమం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి..

**– ఎమ్మెల్యే సత్యప్రభ..**




**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో టిడిపి కార్యాలయం వద్ద గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి పార్టీల తరపున పోటీ చేస్తున్న పేరా బత్తుల రాజశేఖర్ ని గెలిపించాలని కోరుతూ నియోజవర్గ వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో నిర్వహించిన అవగాహన సదస్సుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో జరిగిన విధ్వంసాలను అధిగమించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పోలవరం, అమరావతి, రైల్వే జోన్, విశాఖ ఉక్కు వంటి అనేక అంశాల్లో మెరుగైన ఫలితాలను పొందడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. యువత భవిష్యత్తు కోసం భావితరాల ప్రగతి కోసం ప్రణాళికలు వేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్ళాలి అనే అంకితభావంతో పనిచేసే వ్యక్తులు మనకు నాయకులు గా ఉండడం ఈ రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని సత్య ప్రభ అన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ గానీ, దావోస్ వేదిక గా రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు చంద్రబాబు నాయుడు చేసిన కృషి గాని, ఈ రాష్ట్ర యువత పట్ల వారికున్న అంకితభావానికి నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు.ఎన్డీఏ కూటమి పనితీరు చూసి ఆ పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజశేఖర్ కి పట్టబద్రులు అందరూ మద్దతు ప్రకటించాలని కోరారు. వారి పేరు ఎదురుగా ఒకటి నెంబర్ వేసి వారికి అఖండ విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎన్ డి ఏ శ్రేణులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం తక్షణమే లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలి

**ఏలూరు,మేజర్ న్యూస్:** కూటమి నాయకులు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానం మేరకు తక్షణమే ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్ళు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ),ఏలూరు 2వ డివిజన్ నందు అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఇంటి స్థలాలను పెంచి ఇవ్వాలని రెండవ రోజు అర్జీల నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా పేదవాళ్లకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పేదలు పట్టణ ప్రాంతంలో సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తూ తీవ్ర వ్యవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్న పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆ దిశగా గత ప్రభుత్వం మంజూరు చేసిన పట్టణ ప్రాంతాల్లో సెంటు భూమిని రెండు సెంట్లుగా మార్పు చేసి పట్టాలు జారీచేసి వారికి ఇళ్ల స్థలాలు అందజేయాలని,అలానే ఇంటి నిర్మాణానికి రూ 5లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10వ తేదీన పూర్తి చేసిన అర్జీలను జిల్లా కలెక్టర్‌కి అందించే కార్యక్రమంలో లబ్ధిదారులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలను లబ్ధిదారులకు తక్షణమే అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుని,ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు బళ్ల కనక దుర్గారావు,గొర్లి స్వాతి,ఉప్పులూరి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## శంకరమంచి విశ్వనాథ శర్మకు ఘనసన్మానం



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** అగస్త్యేశ్వర స్వామి వారి ప్రధాన అర్చకులు శంకరమంచి విశ్వనాథ శర్మ గారికి అలంకరణ రత్న బిరుదా కితం పొందిన సందర్భంగా ఆదివారం సాయంత్రం 6.00 గంటలకు అగస్త్యేశ్వర స్వామి వారి గుడి లో చిరు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామప్రజలు , బంధువులు, స్నేహితులు, గాయత్రీ బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొని అభినందనలు తెలియజేసారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మరియు దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.

## ఘనంగా సుందర సాయినాథ్ మందిర ప్రతిష్ట



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** కొవ్వూరు గోదావరి నది తీరాన వేంచేసి ఉన్న సుందర సాయినాథ్ మందిర ప్రతిష్ట 30వ వార్షికోత్సవ మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం నుండి ఫిబ్రవరి 4వ తేదీ మంగళవారం వరకు నిర్వహించే సుందర సాయినాథ్ మందిర ప్రతిష్ట 30వ వార్షికోత్సవ వేడుకలలో బ్రహ్మశ్రీ లింగాల శ్రీనివాస శర్మ నిర్వహణలో శ్రీ గణపతి మహాయాగం,గణపతి హెూమం నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం సాయంత్రం కూచిపూడి నాట్య ప్రదర్శన మూడవ తేదీ సోమవారం శ్రీ సాయినాధునికి ఏకాదశ రుద్రాభిషేకం అర్చన మరియు తీర్థ ప్రసాద వితరణ సాయంకాలం సంపూర్ణ భగవద్గీత పారాయణం భక్తి సంగీత విభావరి నాలుగో తేదీ సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ సంకీర్తన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని శ్రీ షిరిడి సాయినాథ్ ఆధ్యాత్మిక కేంద్ర నిర్వాహకులు తెలిపారు.

భక్తులు శ్రీ సుందర సాయినాధుని మందిర ప్రతిష్ట 30వ వార్షికోత్సవ వేడుకల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించాలని కోరారు.